

# జిందాబాద్

- ఆచార్య కొలకలూరి ఇనాక్

సేవకుణ్ణి. ప్రజాసేవకుణ్ణి'.

'ప్రజా నాయకుడివి, యజమానివి, దేవుడివి కావు కదా!'

'కాను. ప్రజలే దేవుళ్ళు. పల్లెలే దేవాలయాలు. ప్రజలే నా యజమానులు. ప్రజలేం చెబితే అదే చేస్తాను.'

'మాట తప్పవుకదా!'

'తప్పను. చచ్చినా తప్పను.'

పది గ్రామాల సర్పంచులు కూర్చుని సత్యశివసుందరంను తమ నియోజకవర్గం నుంచి యం.యల్.ఏగా ఎన్నిక చేసే విషయం ఆలోచిస్తున్నారు. వాళ్ళు ఏ పార్టీకి చెందిన వాళ్ళు కారు. స్వతంత్రులు.

'నువ్వు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తావా? ఏదైనా పార్టీపక్షాన పోటీ చేస్తావా?'

'మీరేం చెబితే అదే చేస్తాను.'

'ఇండిపెండెంట్ కాండిడేట్'గానే నిలబడాలి.

'మీరెలా చెబితే అలాగే! కానీ ఒక పార్టీపక్షాన నిలబడితే పార్టీ ఓట్లు కూడా నాకు పడి నేను గెలిచే అవకాశం మెరుగుపడి మేలుకలగవచ్చు.'

'ఆ పార్టీని వ్యతిరేకించే ఇతర పార్టీల ఓట్లు నీకు పడకుండా పోవచ్చుకదా. స్వతంత్ర అభ్యర్థి అంటే మా పది గ్రామాల ప్రజలు హర్షిస్తారు. మా మాట వింటారు. నీకు ఓట్లువేస్తారు. గెలిపిస్తారు. సరేనా?'

'సరే!'

'గెలిచింతర్వాత ఏ పార్టీలోనైనా చేరతావా?'

'మీరు చేరమంటే చేరతాను.'

'చేర రాదు!'

'చేరను!'

'మినిస్టర్‌ని చేస్తే-?'

'మీరు అంగీకరించమంటే అంగీకరిస్తాను.'

'మినిస్టర్‌ని చేస్తున్నాం కదా, పార్టీలో చేరమంటే?'

'ఏం చేయమంటారు?'

'మినిస్టర్ పదవి అయినా వద్దుకానీ పార్టీలో మాత్రం చేరను అనాలి.'

'అంటాను!'

'అసెంబ్లీలో నిర్ణయాలు తీసుకొనే ముందు, నువ్వు ఓటు వేయబోయేముందు, మమ్మల్ని సంప్రదించాలి.'

'తగిన సమయం ఉంటుందా?'

'ఉన్నప్పుడే మేం మా అభిప్రాయాలు చెబుతాం వాటిని పాటించాలి.'

'సరే!'

'ఐదేళ్ళదాకా నన్నడిగే నాథుడు లేడని విర్రవీగకూడదు. నా ఇష్టారాజ్యం అనుకోరాదు.'

'అనుకోను.'

'విచ్చలవిడిగా విదేశాల నుంచి అప్పులు తెచ్చేదేన్నీ నువ్వు అంగీకరించకూడదు. మన వారసులకు మనం అప్పులు మిగిల్చి చావకూడదు!'

'చావను.'

'ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ ఇష్టం వచ్చినట్లు వాగ్దానాలు చేయరాదు. కేబినెట్ నిర్ణయం లేకుండా ఎంత మంచి పనయినా డబ్బు విడుదల చేయరాదు.'

'చేయను!'

'అర్థరూపాయికే బస్తా బియ్యం అనరాదు.'

'అనను.'

'తిండి. బట్ట, ఇల్లు, ఉచితం అనరాదు.'

'అనను.'

'ఓట్లకోసం నోట్లు పంచే బదులు వడ్డీ లేని ఋణాలిచ్చి, ఋణాలు మాఫీ చేసే దొంగ నాటకాలు ఆడరాదు.'

'ప్రజాస్వామ్యంలో ప్రజలకు వ్యక్తిగతంగా అభివృద్ధి న్యాయమేకదా!'

'వ్యవస్థ గతంగాచేస్తే న్యాయం. అందరికీ ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు జరగాలి. ఉదాహరణకు రోడ్ల నిర్మాణం, ప్రాజెక్టులు.'

'రోడ్లువల్ల పల్లెల్లో డొంకల్లో, కాలి బాటల్లో తిరిగే సామాన్యులకు ఏం ప్రయోజనం? ప్రాజెక్టులు భూములన్నీ స్వాములకే! పేదలకేం లాభం?'

'భూమి పండితే తిండి, అందరికీ! పనులుంటే కూలీ అందరికీ! బస్సులు, లారీలు ప్రయాణం, రవాణా అందరికీ! కొందరికి ఎక్కువ ప్రయోజనం లాభం ఉన్నట్లు కనిపించవచ్చు కానీ అందరికీ మేలు కలిగించే పనులు ప్రభుత్వం చేయాలి.'

'సరే!'

'నీకిప్పుడు రెండెకరాల మాగాణి ఉంది. ఎన్నికల్లో నువ్వు దాన్ని అమ్మరాదు. యం.యల్.ఏ. అయింతర్వాత వందెకరాలు కొనరాదు.'

'కొనను!'

'కోట్ల రూపాయలు స్విస్ బేంకుల్లో దాయరాదు.'

'దాయను!'

'అక్రమంగా సంపాదించరాదు.'

'సంపాదించను. కానీ నాకు తిండి కొంపాగోడీ గోసిగుడ్డ ఉండాలికదా'.

'ఉంటాయి. నీకు జీతం ఇస్తారు.'

'నా పొలం?'

'నువ్వు సాగుచేసుకోలేవు! ఎవరైనా మగతాకి తీసుకొంటారు. నీ గింజలు నీకిస్తారు.'

'నా పిల్లల చదువులు?'

'ఇప్పుడెట్లా చదివిస్తున్నారో అలాగ్గే. వీళ్ళు వీధిబడిలోంచి బైటకి వచ్చి అమెరికాలో చదవలేరు. డూన్ స్కూల్‌లో చేరలేరు.'

'నేను బాగుపడకూడదా?'

'పడవచ్చు. అక్రమంగా కాదు.'

'ఇక ఇప్పుడు నేను ఎం.ఎల్.ఏ. అయితే ఏం లాభం?'

'జీతం వస్తుంది. దినభత్యం వస్తుంది. ప్రయాణం ఖర్చులు వస్తాయి. ఇల్లు ఉంటుంది. అదనంగానే మాగాణీ గింజలుకూడా ఉంటాయి!'

'మీ యిష్టం!'

'ఐదేళ్ళ తర్వాత ఇప్పుడెట్లా ఉన్నావో అప్పుడు కూడా ఇలాగ్గే ఉండాలి!'

'అలాగ్గే అయిదేళ్ళు ఉంటానా?'

'ఉంటేనే!'

'గెలుస్తానా?'

'గెల్స్తేనే!'

'మీ మాటలు నాకు మార్గాలు.'

'మంచిదే! నీ పద్ధతి మాకు నచ్చకపోతే'

'నచ్చకపోతే!'

'మేం రాజీనామా చేయమంటాం.'

'చేయకపోతే?'

'ఊళ్ళోకి రానీయం.'

'రాకపోతే?'

'బతికి ఉండనివ్వం.'

'అంత దూరం వద్దు.' సత్యశివసుందరం నవ్వుతూ ఉంటే సర్పంచులు బిత్తరపోయారు. టీ బంకులోంచి టీలు ట్రేలోతెస్తే, అందరూ తీసుకొన్నారు.

ఖాళీ గ్లాసులకోసం చొక్కా లేని, మాసిన నిక్కరున్న పదేళ్ళ పిల్లవాడు వేపచెట్టుమీద కూర్చున్న కోకిలను చూస్తూ పరధ్యానంగా ఉన్నాడు, ఖాళీ ట్రే పట్టుకొని.

టీ ఆరుపుకొని అందరూ తాగుతున్నారు. అంత వేడి టీ సుందరం గుటుక్కున మింగాడు. జనం బిత్తర పోయారు. 'అంత వేడి టీ తాగావా' అన్నారు.

'తాగాను. శివుడి గొంతు గరళం భరించలేదా? ఈ టీ అనగానెంత?'

'శివుడూ- గరళమా?'

'అవును. నేను మింగలేని విషంలాంటి మీ మాటలు మింగి శివుణ్ణి అయిపోలేదా'?

'మింగలేకపోతే మానవచ్చు. అభ్యంతరం ఏమీ లేదు.'

'మింగానుకదా! మింగ గలను. ఎంత చేదయినా మింగి గొంతులోనే ఉంచుకోగలను. కానీ బాల కార్మికుల్ని చట్టం నిషేధించింది. వీడు బాలుడు. టీలు అందించటం పని. ఇప్పుడు వీడు బాల కార్మికుడు. చట్టం వీణ్ణీ, మనల్నీ, టీ బంకు సన్నాసినీ అరెస్టుచేస్తుంది. దీన్ని మనం సాగనివ్వ వచ్చునా?

'సాగనివ్వరాదు- కానీ వీడీపని చేయకపోతే వాడి తల్లికి, బీదరాలుకి, విధవకి, మంచంలోనే చావు!'

'మనం ఇంతమందిమి ఉండి. ఆ అనాధను అలా చావనివ్వటం కానీ, ఈ పసివాణ్ణి ఇలా కానివ్వటం కానీ ధర్మమా?' అందరూ ఆలోచనలో పడ్డారు. 'అందువల్ల కొన్ని చూసీచూడనట్లు పోవాలి' అన్నాడు సత్యశివ సుందరం.

'మనకు ప్రజాస్వామ్యం విలువలు, హక్కులు తెలుసు. కానీ దానికి అవసరమైన జాగృతి, విధులు అంతుబట్టవు. ఒకడు ఎందుకు ఇందరికి సేవ చేస్తాడు? సేవచేసిన వాడికి ఏం లాభం? ఈ సేవలో ఎందరికి శత్రువు అవుతాడు? ఎందరికి మిత్రుడూ, అందరికీ మేలైన పని ఎవడైనా చేయగలడా? దేవుడు చేస్తాడా? చేస్తే ఇన్ని తిట్లు ఎందుకు తింటున్నాడు? ఆలోచించండి. ప్రజాస్వామ్యంలో నైతికత ఎంత? సంపన్నులు సంపన్నులు గానే ఉంటారా? బీదలు బీదలుగానే ఉండాలా? ఆలోచించండి. ప్రజాస్వామ్యంలో ఓటు మాత్రమే అందరికీ సమానం. డబ్బు సమానం కాదు. కులం సమానంకాదు. మేము సమానంకాదు. మన స్తత్వం సమానం కాదు. ఈ అసమానతల మధ్య ప్రజాస్వామ్యం ఎలా రాణిస్తుంది? మీరు నేను ఎలా ఉంటే మంచి ఎం.ఎల్.ఏ.ని కాగలరో జాగ్రత్తగా చెప్పారు. ఇలా మీరు చెప్పవలసి రావటం వెనుక అలా ఉండని నిజం యం.యల్.ఏ.లు ఉన్నారనే కదా అర్థం. వాళ్లను మీరేం చేయగలరు? అందరినీ సరిదిద్దగలరా? రాష్ట్రాన్ని సరిచేయగలరా? దేశాన్ని బాగుచేయగలరా? మీఅంత చైతన్యం జనానికి ఎప్పుడు వస్తుంది? అప్పటి దాకా ఈ దేశం ఏం కావాలి? ప్రజాస్వామ్యం ఉండాలా వద్దా? ప్రజలకు తిండి బట్ట గూడు ఇవ్వాలా వద్దా?'

'ఆగు! చాలా చెప్పావు? తిండి, బట్ట, గూడు ఇవ్వటం కంటే వాళ్ళే ఏర్పాటుచేసుకోగలిగే పరిస్థితులు ఏర్పరచాలి. ఈ దేశంలో అందరికీ రైట్సు తెలుసుకానీ, డ్యూటీసు తెలియవంటావు. ఇంతదాకా వీళ్ళకు డ్యూటీసే తెలుసు. ఇప్పుడేకదా రైట్సు తెలుస్తూ ఉంది. సేవ చేసేవాడు లాభం కోరుకోకూడదు. కోరుకోకపోతే శత్రువులుండరు. ఒక పని అందరికీ మంచి పనిగా ఉండదు. నిజమే కానీ క్రమంగా మంచిపని కాంతులు వెదజల్లగలదు. ఈ దేశంలో సంపన్నులు పేదలు తేడా తగ్గాలనే, పోవాలనే కదా ప్రయత్నం. ఒకనాటికి తేడా



'మాకే పార్టీ ఇష్టంలేదు. మాకిష్టమైన పార్టీ ఈ దేశంలో, రాష్ట్రంలో లేదు. మా ఎం.ఎల్.ఏ. మాలాంటి వాడే కావాలి. అందుకే స్వతంత్ర అభ్యర్థిగా మా కాండిడేటు గెలవాలని మాకిష్టం. అయినా నీకు ఇంతవరకు ఏ పార్టీలేదు. ఏ రాజకీయ దృక్పథమూ లేదు. ఏ పార్టీ టిక్కెట్టు ఇస్తేఆ పార్టీ మేనిఫెస్టో నీ ఎజెండా అవుతుంది. టిక్కెట్టు ఇవ్వటమే దృక్పథం కలిగించటమంటే కలిగించుకోవటం అంటే ఎంత ఘోరం.

అంతరించటం అనివార్యం. బానిస దేశం స్వతంత్ర దేశమైనప్పుడు ఆరంభంలో వచ్చే అవాంతరాలను దేశం ఎదుర్కొంటూనే ఉంది. ఇప్పుడు అప్రజాస్వామిక ప్రవర్తన తగ్గి పూర్తి ప్రజాస్వామిక లక్షణాలతో కనీసం ఎం.ఎల్.ఏలు మనవాళ్ళు, మా ప్రతినిధి అయినా ఉండటం మనం కోరుకోవాలి కదా! వెలుతురు క్రమక్రమంగా వస్తుంది. చైతన్యం ఒక్కసారీ రాదు. వెలుతురు వచ్చినట్లల్లా చైతన్యం వస్తుంది. మన ప్రజలు, ప్రజాసేవకులు చైతన్యవంతులు కావాలన్నది కాంక్ష! నెరవేరాలన్నది ఆశ! నెరవేర్చాలన్నది యం.యల్.ఏ. బాధ్యత! అందుకే నిన్ను మాకు తెలిసినంతమేర ప్రజాస్వామికంగా ఉండే మా యం.యల్.ఏ. కావాలని మా అభీష్టం.'

'న్యాయమే!'

'మా అభీష్టానికి తగినట్లుగా ఉంటే, ఉంటావంటే నిన్ను మా ఎం.ఎల్.ఏగా ఎన్నుకొంటాం.'

'నా శాయశక్తులా ప్రయత్నిస్తాను.'

'నువ్వు ప్రజాసేవకుడు. నియోజకవర్గానికి పెద్ద జీతగాడివి. మేం చిన్న జీతగాళ్ళం. గుర్తుంటుందా?'

'ఉంటుంది.'

'నువ్వే సేవకుడివి. నీకు సేవకులు ఉండరాదు.'

'ఉండరు.'

పి.ఏ. పి.యస్. అటెండర్లు, క్లర్కులు, అంటూ మినిష్టరువై వాళ్ళను వెంటేసుకొని తిరగరాదు.

'తిరగను.'

'గన్‌మేన్లు ఉండరాదు!'

'రక్షణ?'

'సేవకుడికి రక్షణ అక్కరలేదు. ఏ ప్రమాదమూ ఉండదు. పైగా ప్రజలు కాపాడుకొంటారు. గాంధీకి గన్‌మెన్‌లు ఉండేవారు కారు.'

'ఓడిపోయిన అభ్యర్థి కీడు తలపెడితే, పార్టీలు పగ పెంచుకొంటే,?'

'నువ్వు సక్రమంగా గెలిచావని తెలిస్తే ఎవరూ శత్రువులు కారు. అక్రమంగా గెలిచారని తెలిస్తే, నిన్ను గన్‌మేన్లు రక్షించలేరు. అకారణంగా ఎవరైనా పగ పెంచుకొంటే ప్రజలే నిన్ను కాపాడతారు!'

'గాంధీని ఏ ప్రజలు కాపాడారా?' కాల్చి చంపారు కదా?'

'సేవలో చావు తప్పక పోవచ్చు. సేవలో చనిపోయినా ధన్యతే! ఇందిర చనిపోయినా, రాజీవ్ చనిపోయినా గార్డ్సు లేకనే చనిపోయారా? పది మంది మంచికోసం ఒక పనిచేస్తే అది ఒకడికి కష్టమై, అనిష్టమై, నష్టమై అలా శత్రువై, చంపినా చంపవచ్చు. అలా చనిపోయినా, సేవలో చనిపోయేది కూడా అదృష్టమే! ఇటువంటి చావు వద్దనుకొంటే చిరకాలం కాకిలా బతికి ఎప్పుడో, ఎక్కడో, ఎలాగో నిరుపయోగంగా చనిపోవచ్చు. చివరికి నువ్వు ఎలా చావదలచుకొన్నావో నిర్ణయించుకో!'

'ఆలోచించుకొంటాను. చాలా పెద్ద సమస్యల వలయంలాగా ఉంది ఎన్నికల గోల.'

'అప్పుడే మాట్లాడదాం రా.'

సత్యశివ సుందరం అడిగాడు 'నేను ఏ పార్టీపక్షాన అయినా నిలబడితే?'

'మేం ఓట్లు వేయం!'

'ఎందుకని? నేను మంచివాడినా, మీ వాడిని, మీ మాట వినే వాడినే కదా.'

'మాకే పార్టీ ఇష్టంలేదు. మాకిష్టమైన పార్టీ ఈ దేశంలో, రాష్ట్రంలో లేదు. మా ఎం.ఎల్.ఏ. మాలాంటి వాడే కావాలి. అందుకే స్వతంత్ర అభ్యర్థిగా మా కాండిడేటు గెలవాలని మాకిష్టం. అయినా నీకు ఇంతవరకు ఏ పార్టీలేదు. ఏ రాజకీయ దృక్పథమూ లేదు. ఏ పార్టీ టిక్కెట్టు ఇస్తేఆ పార్టీ మేనిఫెస్టో నీ ఎజెండా అవుతుంది. టిక్కెట్టు ఇవ్వటమే దృక్పథం కలిగించటమంటే కలిగించుకోవటం అంటే ఎంత ఘోరం. ఒక సామాజిక దృష్టి. ఒక ప్రాపంచిక దృక్పథం ఉండి, ఈ భావజాలానికి ఏ రాజకీయ పక్షం అనుకూలంగా ఉందో, అందులో నువ్వు చేరితే కొంత సబబు! కాని టిక్కెట్టు ఇచ్చిన పార్టీ మేనిఫెస్టోనే నీ మేనిఫెస్టో అంటే ఎంత బేసబబు? ఆలోచించుకో! మా సపోర్టు కావాలంటే స్వతంత్రుడుగా ఉండు! మాట మాత్రమే వింటే చాలదు. చేతలు, ఆలోచనలు సక్రమంగా ఉండాలి.'

ఆలోచించి మళ్ళీ చెబుతానని సత్యశివసుందరం వెళిపోయాడు.

నాలుగు పార్టీల్లో గెలుపు అవకాశాలున్న రెండు పార్టీలు పరిశీలించాడు. రెండింటిలో ఏది టిక్కెట్టు ఇచ్చినా తానూ, తన పేరుప్రఖ్యాతులతో గెలుస్తాడు. ఒక పార్టీలో పోటీ ఎక్కువ అందరూ నాయకులే! ఒక పార్టీలో పోటీ తక్కువ. (మిగతా 20వ పేజీలో)


# వాతావరణానికి మేలుచేసే వనం!

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ కాలుష్యం ఏర్పడింది. ఇందువలన మనుషులకేకాక, పశుపక్ష్యాదులకు కూడా పెను ముప్పు ఏర్పడింది. విచక్షణా రహితంగా చెట్లను నరకడం, అడవులను ధ్వంసం చెయ్యడం, నీటిని, గాలిని సహితం కలుషితం చేస్తున్నారు మానవులు. ఇందువలన బహువిధాలుగా వాతావరణ కాలుష్యం ఏర్పడి, రకరకాల వ్యాధులు ఏర్పడుతున్నాయి.

పశువులు, పక్షులు అడవుల్లోని వివిధ రకాల మృగాలు, నదులలోని సముద్రంలోని వివిధ రకాల జలచరాలు మరణిస్తున్నాయి. ఇందువలన మనిషి నేడు కళ్లు తెరిచి పచ్చదనంకోసం, కాలుష్య రహిత ప్రపంచం కోసం పరితపిస్తున్నాడు. క్రమేపీ ప్రజానీకంలో వాతావరణాన్ని కాపాడుకోవాలనీ, ప్రకృతిని సంరక్షించుకోవాలనే ఆతృత, ధ్యేయం ఏర్పడుతోంది. అందుకు అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో పచ్చదనం కోసం విశేషమైన కృషి సాగుతోంది.

ముంబాయి మహనగరం వాతావరణ కాలుష్యాన్ని తొలగించడంకోసం పచ్చదనానికై తనవంతు కృషిని సాగిస్తోంది. ప్రకృతి ప్రేమికులు, ఎందరో కార్యకర్తలు ముందుకు వచ్చి, ముంబాయిలోని 'వాణీబాగ్ బొటానికల్ గార్డెన్'ను అమోఘమైన రీతిలో అభివృద్ధి చేస్తున్నారు. కార్పొరేషన్‌వారు ఆ వనంలో అనేక మొక్కలను నాటారు. అక్కడ చిరకాలంగా ఉంటున్న జంతువులకు, పక్షులకు తగిన రక్షణ ఏర్పాటుచేశారు. చాలాకాలంగా అక్కడ వున్న వృక్షాలకు కట్టుదిట్టమైన రీతిలో రక్షణ చేకూర్చారు. 100 సంవత్సరాలకు మించిన వృక్షాలు సహితం ఉన్నాయి.

ఆ వనంలో వున్న వేలకొద్దీ జంతుజాలంతోపాటు కొన్ని అపురూపమైన 'ఫ్లయింగ్ ఫాక్స్'లు, 'ఫ్రూట్



మ్యాట్స్', ఎగిరే వర్ణచిత్రాల వంటి అతి మనోహరమైన వేలాది సీతాకోకచిలుకలు- అంతకుముందు తగిన రక్షణ లేక అలమటిస్తున్నాయి. వాటితోపాటు ఎన్నెన్నో పక్షులు సహితం తమకు తగిన సౌకర్యాలు లేక అతి దీనావస్థలో ఉన్నాయి. ముంబాయి కార్పొరేషన్ వాటికి అనేక సౌకర్యాలు ఏర్పాటుచేసి, హెచ్చుసంఖ్యలో అక్కడి సిబ్బందిని, వారికొరకు క్వార్టర్లు నెలకొల్పింది.

ఆ వనానికి 'వీర్ మాత జిజాబాయ్ భోస్లే ఉద్యాన వన్'అనే మరొక పేరు సహితం ఉం ప్రస్తుతం ఆ వనాన్ని తిలకించడానికై రో 8వేల మంది ప్రేక్షకులు వెళ్తున్నారు. సెలవు జుల్లో వారి సంఖ్య 30వేల వరకూ ఉంటుం ఆ వనం అభివృద్ధికొరకు అతి పెద్ద ప్రణా ఏర్పాటైంది. అందుకోసం 400కోట్ల రూ యలు ఖర్చు చెయ్యడం జరుగుతోంది.

భవిష్యత్తులో ఆ వనం ప్రపంచంలో గొప్ప వనాలలో ఒకటిగా రూపొందనున్నది.

అందులో 53 ఎకరాల హెరిటేజ్ పార్క్, ఒక త్రీ థియేటర్, ఆడిటోరియమ్, 100 కార్లకోసం పార్కిం సిబ్బంది క్వార్టర్లు, నైట్ సఫారీలు ఏర్పాటుకానున్నాం ఇప్పటికప్పుడే 4వేల మంది ఉత్సాహవంతులు, కార్య ర్తలు ఆ వనం అభివృద్ధికి తమ సహకారాన్ని ఇస్తున్నా ఆ వనం 1861వ సంవత్సరంలో నెలకొల్పడం జరిగిం బృందావనం వంటి ఆ ప్రదేశంలో ప్రవేశించిన వా ఒక భూతల స్వర్గంలోకి ప్రవేశించిన అనుభూతి కలు తుంది. అచ్చట ఎటుచూస్తే అటు పచ్చదనం నేత్రోత్స చేస్తూ ఉండగా, పక్షుల కిలకిలరావాలు ఎంతో ఆహ్లాద కలిగిస్తాయి. గాలిలో తేలుతూ, సుతారంగా వివి రకాల పుష్పాలపై వాలుతూ మకరందాన్ని గ్రోలుతు సీతాకోకచిలుకలు మనకు సంతోషం కలిగిస్తాయి.

'గ్రాస్‌డెమన్', 'మెమన్ ఫ్యాన్సీ', 'ప్లెయిన్ టైగ 'ఫిచ్‌చీ', 'బాండెడ్ అవుల్' వంటి అపురూపమైన సీ కోక చిలుకలను మనం అక్కడ చూడవచ్చు. ఆ వన అభివృద్ధికై 'డబ్ల్యుడబ్ల్యుయల్ ఇండియా', 'నేచన సొసైటీ- ఆఫ్ ఫ్రెండ్స్ ఆఫ్ ట్రీస్' 'శాంక్చుయ ఆసియా', 'కన్సర్వేషన్ యాక్షన్'వంటి సంస్థ తోడ్పాటు అందజేస్తున్నాయి.

**- కొడిమెల శ్రీరామమూ**

---

**(8వ పేజీ తరువాయి)**ముగ్గురు నలుగురే నాయకులు. ఈ రెండు పార్టీల్లో ఏది డబ్బు ఎన్నికల ఖర్చుకు ఎక్కువగా ఇవ్వగలుగుతుంది. ఒక దానికి- రెండింటిలో- విజయావకాశాలు ఎక్కువ. మరొకదానికి ఎన్నికల్లో డబ్బు ఖర్చుచేసే అవకాశం ఎక్కువ. ఏ పార్టీ టిక్కెట్టు అయినా ఫరవాలేదు.

ఒక పార్టీ పెద్దల్ని కదిపి చూశాడు. తను కోరుతున్న నియోజకవర్గానికి పాతిక మంది నాయకులు పోటీ పడుతున్నారు. సిట్టింగు ఎం.ఎల్.ఏ. ఉండనే ఉన్నాడు.

మరో పార్టీలో సహజంగానే సిట్టింగు లేడు. ఇద్దరో ముగ్గురో పోటీలో ఉన్నారు. కొద్దిగా ఖర్చుచేయగలిగితే సీటురావచ్చు. ప్రయత్నిస్తే గెలవ్వచ్చు.

ఆ పార్టీ గెలుపుకోసం డబ్బు బాగా ఖర్చుచేయగలదు. ఈ పార్టీ అంతగా ఖర్చుచేయలేదు.

ఆ పార్టీ టిక్కెట్టు, ఎంత ప్రయత్నించినా రాదు. ఇక ఈ పార్టీ టిక్కెట్టుకే ప్రయత్నించాడు. టిక్కెట్టు వచ్చింది మళ్ళీ పది మంది సర్పంచుల్ని అర్థించాడు. వాళ్ళు మాటతప్పలేదు. తిరస్కరించారు. మాకు మా అభ్యర్థి ఉన్నాడన్నారు.

పాలక పక్షం, ప్రతిపక్షం అభ్యర్థులేకాక ఈ స్వతంత్ర అభ్యర్థి ఎన్నికల బరిలోకి దిగారు.

రోజులు గడుస్తున్నకొద్దీ ఎన్నికల వేడి పెరిగింది. జిందాబాద్‌లు, డౌన్ డౌన్లతోపాటు, మా అభ్యర్థికే మీ ఓటు, వేసి, వేయించి, గెలిపించ ప్రార్థనలు పూటుగా వినిపించాయి.

సత్య శివ సుందరం పొలం అమ్మాడు. ఖర్చుచేశాడు. అప్పు తెచ్చాడు. ఖర్చు చేశాడు. పార్టీ ఫండు ఇచ్చింది ఖర్చు చేశాడు. ఎం.ఎల్.ఏ. అయితే పనులు చేయించుకో దలచిన వ్యాపారులు, కాంట్రాక్టర్లు, నల్ల ధన సంపన్నులు సంచులు బయటికి తీశారు. డబ్బు విరజిమ్మారు.

తాను గెలవటం ఖాయమని సుందరం గ్రహించాడు.

సర్పంచుల సంఘం ప్రజాస్వామ్య విలువలు ఉపన్యసిస్తూనే ఉంది.

ఇతర అభ్యర్థుల్లో కారుల్లో తిరుగుతుంటే, స్వతంత్ర అభ్యర్థి కాలి నడకన తిరుగుతున్నాడు.

ఎన్నికల ముందురోజు గానీ అందరూ కల్లు సారాయి బిరియాని- విచ్చలవిడి కాగా, స్వతంత్ర అభ్యర్థి టీలు కూడా తాగించలేదు.

ఎన్నికలు మామూలుగా జరిగాయి. అద్భుతాలు ఏమీ జరగలేదు. ఫలితాలు ప్రకటించారు.

సత్య శివ సుందరం తిరుగులేని మెజారిటీతో గెలిచాడు. ప్రత్యర్థులకు డిపాజిట్లు రాలేదు.

ప్రమాణం చేశాడు సుందరం. అసెంబ్లీ ఒక సెషన్‌లో కాలం గడిపాడు.

ఎం.ఎల్.ఏ. స్వగ్రామం వచ్చాడు ఇల్లు లేదు. పొలం లేదు. పిల్లలు ఊళ్ళో లేరు. మిత్రుల్లేరు. ఓటర్లు లేరు. ఆశ్రితులున్నారు. మీటింగులు, విందులు, పొగడ్తలు, సన్మానాలు హడావుళ్ళు.

నాలుగేళ్ళు గడిచాయి. నగరంలో స్టార్ హోటల్లాంటి ఇల్లు. డూన్ స్కూల్లో పిల్లల చదువులు. భార్య శరీరం నగల షాపు. రెండొందల ఎకరాల సెజ్ భూమి రహస్య నిధులు, డబ్బు రాశులు. నల్లగా. ఎర్రగా. తెల్లగా పచ్చగా విబ్‌జియార్.

కార్ల కాన్వాయి. గన్‌మేన్‌ల బందోబస్తు పోలీసులు పరుగులు. మనిషి కట్టు నడక. నడత మారాయి. మెడ నరం పట్టింది. మెడ వంగదు. నేల కనబడదు.

సర్పంచుల సంఘం ఎదురుబడింది. ఎవరూ నమస్కరించలేదు. 'ప్రజాసేవకుణ్ణి కాను' అన్నారు సుందరం. 'ప్రజానాయకుడివా' అంది సంఘం. సంఘం చెవిలో రహస్యం బాహాటంగా చెప్పాడు. మిండగాణ్ణి! ప్రజాకంటకుణ్ణి! అంటే హంతకుణ్ణి'.

'మళ్ళీ గెలగలవా?'

గెలుస్తాను. చెప్పాను కదా, హంతకుణ్ణి. నేను మళ్ళీ గెలవాలంటే మీరు బ్రతికి ఉండకూడదు.

సర్పంచుల సంఘం వణికింది.

రోజు కూలీలు జిందాబాద్ అంటున్నారు. గన్‌మేన్ కాపలా కట్టుదిట్టం చేశారు. పోలీసులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు.

'ప్రజాస్వామ్యం- జిందాబాద్. సత్యశివసుందరం జిందాబాద్'. హోరెత్తి పోతూ ఉంది.

ఎం.ఎల్.ఏ. గద్దించాడు. 'బ్రతికి ఉంటారా? చచ్చి సాధిస్తారా?'

సర్పంచుల సంఘం వణుకుతూనే ఉంది. చేతులెత్తి మొక్కింది.

జిందాబాదుల్లో ఎం.ఎల్.ఏ. నవ్వు కలిసిపోయింది.